# మాటు



**రామారావు** భార్యతో సినిమాకి వెళ్ళొచ్చాడు.

ఇంటి ముందు రిక్షాదిగి ఇంటి తాళం తీస్తుంటే, వీధి అరుగు మీది చీకట్లో నుంచి మూలుగు వినిపించింది. "ఎవరయ్యా నువ్వు?" అన్నాడు రామారావు.

సమాధానంగా మళ్ళీ మూలుగు వినిపించింది. రామారావుకి ఏమీ అర్థం కాలేదు. లోపలికి వెళ్ళి లైటు వేసి బట్టలు మార్చుకుని, లుంగీ కట్టుకుని టార్చిలైటు పట్టుకుని బయటకు వచ్చాడు.

అరుగుమీద మూలగా వో ముసలాడు బక్క చిక్కిపోయి కళ్ళు మూసుకుని పడి ఉన్నాడు. చినిగిపోయిన పాత చిన్న పంచె కట్టుకుని ఉన్నాడు. ఒంటి మీద స్పృహ ఉన్నట్లు లేదు.

"వడగొట్టి పడిపోయినట్లున్నాడండి పాపం ముసలాడు!" అంది సీతారత్నం జాలిగా.

'నోట్లోనుంచి నెత్తురు కారినట్లుంది. మరకలు చూడు" అన్నాడు రామారావు.

"నాకేదో భయంగా ఉందండి. ఈ రాత్రికి మన అరుగు మీదే హరీ అంటాడేమో!" అంది సీతారత్నం.

రామారావుకు ఏం చేయాలో పాలుపోలేదు. ఎంత పిలిచినా పలకటం లేదు ముసలాడు. మాటి మాటికి మూలుగుతున్నాడు. రామారావు వీధిలోకి పరకాయించి చూశాడు. రోడ్డంతా నిర్మానుష్యంగా, చీకటిగా కూడా ఉంది. దూరంగా కుక్కల ఏడుపులు వినబడుతున్నాయి. ఆకాశంలో మబ్బులు నల్లగా, దట్టంగా కమ్ముకుంటున్నాయి.

వీధికి అవతలవేపు వో చెట్టు క్రింద రిక్షా ఒకటి ఉంది. అందులో రిక్షావాడు కామోసు నిద్రపోతున్నాడు. రామారావుకి ఆ రిక్షాను చూడగానే వో అయిడియా వచ్చింది. ఆ రిక్షా వాడి దగ్గరకు వెళ్ళి వో కుదుపు కుదిపి "బండి కట్టాలి, లే లే!" అన్నాడు. రిక్షావాడు బద్ధకంగా లేచి కళ్ళు చికిలించి చూస్తూ, "కిరాయికి రానండి, ఇంకో బండి చూసుకోండి" అన్నాడు. రామారావుకు ఆ వీధి చివరికంట ఇంకో రిక్షా ఎక్కడా కనబడలేదు. చేసేది లేక ఆ రిక్షావాడిని మళ్ళీ లేపి,

"ఒక సాయం చేయాలి, బాబూ!" అన్నాడు.

ఏమిటి? అన్నట్లు రామారావు వైపు చూశాడు ఆ రిక్షా వాడు.

"నాతో రా" అని రామారావు ఆ రిక్షా వాడిని ముసలాడి వద్దకు తీసుకువచ్చాడు. వాడు ఇంకా మూలుగుతూనే ఉన్నాడు.

"వీడు ఎవడో వచ్చి మా అరుగు మీద పడుకున్నాడు. లేపితే లేవటం లేదు" అన్నాడు రామారావు.

"ఎండ దెబ్బ తగిలినట్లుందండి" అన్నాడు వాడు.

"వీడిని ఇక్కడ నుండి తీసుకు వెళ్ళి ఏ సత్రం అరుగుమీదో పడుకోబెట్టు" అంది సీతారత్నం.

"వీడు అసలే చచ్చిపోయేటట్లున్నాడండి. పైగా, నోట్లోనుంచి నెత్తురు కూడా వస్తోందండి. దారిలో నా రిక్షాలో చచ్చిపోతే పోలీసులు నేను చంపేసినా నంటారండి, మీరు ఇంకో రిక్షాని పిలుచుకోండి. నావల్లగాదు" అని వెనక్కి తిరిగాడు ఆ రిక్షావాడు.

ఇంతలో ముసలాడు మళ్ళీ మూలగటం మొదలు పెట్టాడు. రామారావు "నీకు ఎంత కావాలో చెప్పు. ఇస్తాను" అన్నాడు బతిమాలుతూ.

"వో వంద ఇప్పించండి", అన్నాడు రిక్షావాడు. రామారావు ఆలోచనలో పడ్డాడు. పోనీ మునిసిపాలిటీ వాళ్ళకు ఫోను చేస్తే అనుకున్నాడు. ఈ రాత్రివేళ అక్కడమాత్రం ఎవరుంటారు? తెల్లవారేవరకు అరుగుమీద ఈ ముసలాడిని ఉంచటానికి రామారావుకి ఇష్టం లేదు. "యాభై తీసుకో!" అంది సీతారత్నం. భర్త దగ్గర అంతకంటే ఎక్కువలేదని ఆమెకు తెలుసు.

రిక్షావాడు వో క్షణం ఆలోచించి, "సరే! ఇప్పించండి" అన్నాడు.

రిక్షావాడు ముసలాడిని భుజం మీదకు ఎత్తుకుని రిక్షాలో పడుకోబెట్టాడు. ముసలాడు తల వేళ్ళాడేశాడు.

మూలుగు ఆగిపోయింది. రామారావు త్వరగా లోపలికి వెళ్ళి జేబులో ఉన్న ఏభై రూపాయలు తెచ్చి ఆ రిక్షావాడి చేతిలో పెట్టి, "త్వరగాపో నియ్!" అన్నాడు.

రిక్షా రోడ్డు మలుపు తిరగ్గానే "ఇక భోజనానికి లేవండి" అంది సీతారత్నం.

"నాకు ఆకలిగా లేదు. నువ్వు తిను" అన్నాడు రామారావు, ఖాళీ అయిన జేబును తలుచుకుంటూ.

• • • •

"ఏరా ముసలోడా! ఎట్లాగున్నావ్?" అన్నాడు రిక్షావాడు రిక్షాని తొక్కుతూ, నోట్లోని కిళ్ళీని తుపుక్కున ఉమ్మేసి,

"నా వాటా పాతిక రూపాయలు ఇలా పడేయ్. ఇంటికిపోయి తొంగోవాల" అన్నాడు ముసలాడు లేచి కూర్చుంటూ.

"నీ ఈ యాపారం బాగుందిరా. ఏమీ కష్టపడకుండా పాతిక రూపాయలు సంపాదించావ్" అన్నాడు రిక్షావాడు, వర్షపు జల్లులో రిక్షాను స్పీడు ఎక్కిస్తూ.

**– కె. వి. రామప్రసాద్**